
సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024

ప్రత్యేక పాలనపై దృష్టి



పెద్దపల్లిరూరల్: గ్రామ పంచాయతీ ప్రత్యేక పాలనపై దృష్టి సారించామని జెడ్పీ సీఈవో నరేందర్ తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాక ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు.

కిరణ్‌రాజ్‌కు సన్మానం



గోదావరిఖని: సింగరేణి అధికారుల సంఘం కేంద్ర కమిటీ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన డాక్టర్ కిరణ్‌రాజ్‌ను ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి శాలువాతో సన్మానించి అభినందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.4/16.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయస్థాయిలో రాణించాలి



సాయితేజను అభినందిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటకు చెందిన సాయితేజ జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో రాణించి జిల్లా కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆకాంక్షించారు. శనివారం సాయితేజను అభినందించారు. ఈనెల 7, 8వ తేదీల్లో హన్మకొండలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి తెలంగాణ జట్టుకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని పటియాలలో ఈనెల 28 నుంచి జాతీయస్థాయి అండర్-20 రెజ్లింగ్ పోటీలు జరుగనున్నాయన్నారు. జిల్లాలో ఆసక్తిగల క్రీడాకారులు ముందుకొస్తే రెజ్లింగ్ క్రీడాభివృద్ధికి సహకారం అందిస్తామని కలెక్టర్ అన్నారు. రెజ్లింగ్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, మహమ్మద్ రఫీ, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

21నుంచి మేడారంప్రత్యేక రైలు



రామగుండంలో ప్రత్యేక రైలు

రామగుండం: మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర భక్తుల సౌకర్యార్థం ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక రైలు నడిపిస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ రైతులు కాగజ్‌నగర్ - వరంగల్ మధ్య నడుస్తుందన్నారు. కాగజ్‌నగర్‌లో ఉదయం గం.5.30లకు బయలుదేరి ఉదయం 10.00 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో వరంగల్‌లో మధ్యాహ్నం 12.00 గంటలకు బయలుదేరి సాయంత్రం 4.00గంటలకు కాగజ్‌నగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. సింగరేణి ప్యాసింజర్ రైలు ఆగే స్టేషన్లలో ప్రత్యేక రైలు ఆగుతుందని అధికారులు వివరించారు.

ఆదర్శంగా నిలవాలి



అభ్యర్థులతో జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: పోలీసుశాఖలో ఉన్నత ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. సింగరేణి సంస్థ అందించిన ఉచిత శిక్షణతో పోలీసుశాఖలో ఉద్యోగాలు సాధించిన 11మంది యువకులను జీఎం శనివారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు పరిసర గ్రామాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. క్రమశిక్షణ కలిగిన పోలీస్‌శాఖలో మరింత ఉన్నత స్థానాలు సాధించి సంస్థ, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు జిగురు రవీందర్, రాంరెడ్డి, జి.రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్, షరీఫ్‌మహమ్మద్, దేవారెడ్డి, హనీఫ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



గుప్తాను సన్మానిస్తున్న జీఎం గురువయ్య

రామగిరి(మంథని): పనిస్థలాల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. ఆర్జీ-3 ఏరియా ఏపీఏ గనిపై శనివారం రామగుండం రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తాతో కలిసి ఆయన పర్యటించారు. లాంగ్‌వాల్ అభివృద్ధి, కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. చైర్ లిఫ్టింగ్ సిస్టం ద్వారా 87 లెవల్ వరకు తనిఖీ చేశారు. భద్రత చర్యలు, ప్రణాళిక గురించి జీఎం వెంకటేశ్వర్లునుూయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుప్తాను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియా ఇంజినీర్ సీతారామం, సేఫ్టీ అధికారి వెంకటరమణ, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ కె.జనార్దన్, ఎస్‌వో రమేశ్ పాల్గొన్నారు.



పోదాం పద.. సమ్మక్క జాతర



వనదేవతల జాతరకు అంతా సిద్ధమైంది. రెండేళ్లకోసారి వచ్చే సమ్మక్క- సారలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఈనెల 21న సారలమ్మ ఆగమనంతో ప్రారంభమయ్యే జాతర 24న అమ్మవార్ల వన ప్రవేశంతో ముగుస్తుంది. జాతరకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఉన్న సమ్మక్క గద్దెలను సిద్ధం చేస్తున్నారు. గద్దెలకు రంగులు, చలువు పందిళ్లు, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని గోదావరిఖని, నీరుకుల్ల, రేకుర్తి, శంకరపట్నం తదితర ప్రాంతాలు మినీ మేడారాన్ని తలపించగా... మరో 100కు పైగా ప్రాంతాల్లో సమ్మక్క- సారలమ్మ జాతర ఘనంగా నిర్వహించనున్నారు. దూరప్రాంతంలో ఉన్న మేడారానికి వెళ్లేందుకు వీలుకాని భక్తులు సమీప జాతరల వద్ద తల్లులకు మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సమీపిస్తున్న క్రమంలో ఉమ్మడి జిల్లాలోని సమ్మక్క జాతర ప్రాంతాలు.. జరుగుతున్న ఏర్పాట్లు.. ఆయా ప్రాంతాల ప్రత్యేకతపై సండే స్పెషల్..!! - 8లో▸

'ఆపరేషన్ ఎనీమియా'

- జిల్లాలో 'ముక్తభారత్' వైద్య పరీక్షలు
- చిన్నారుల్లో తగ్గుతున్న హిమోగ్లోబిన్
- పౌష్టికాహారం, సమతుల ఆహారం లోపమే కారణం
- విశ్లేషిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

వైద్య పరీక్షల సమాచారం(ఇప్పటివరకు)	
వైద్య పరీక్షలు చేయించుకున్నవారు (బాలురు 2,601, బాలికలు 4,463)	7,064
మధ్యస్థ రక్తహీనతగల వారు (బాలురు 553, బాలికలు1,551)	2,104
స్వల్ప రక్తహీనత ఉన్నవారు (బాలురు 522, బాలికలు 982)	1,504
తీవ్ర ఎనీమియా బాధితులు (బాలురు 37, బాలికలు 126)	163
నార్మల్‌గా ఉన్నవారు (బాలురు1,495, బాలికలు1,810)	3,305
ఐరన్ స్ట్రిప్స్ తీసుకున్న మొత్తం విద్యార్థులు	6,912



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో రక్తహీనతతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితులకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్నారు. మాతాశిశు మరణాలకు రక్తహీనతే ప్రధాన కారణమని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. 2020లో 'ఎనీమియా ముక్త్ భారత్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కరోనా ప్రభావంతో అప్పట్లో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిలిపివేసింది. ఈ ఏడాది జనవరి 24 నుంచి ఈప్రక్రియ కొనసాగిస్తోంది. ఈనెల 28వ తేదీ వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే బృందం వైద్యపరీక్షలు నిర్వహిస్తోంది.

పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా? పౌష్టికాహారం అందుతుందా? అనే అంశాలపై ఆరా తీస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా పిల్లల్లో అనారోగ్య సమస్యలు గుర్తించి, వాటిని నియంత్రించేందుకు హిమోగ్లోబిన్ పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించింది.

రోజూ 10 బృందాలు.. 100మందికి పరీక్షలు..

- జిల్లాలో చాలామంది విద్యార్థులు రక్తహీనతతో బాధపడుతున్నారు. తద్వారా అనేక రుగ్మతలకు గురవుతున్నారు.
- చదవుపై దృష్టి సారించలేకపోతున్నారు.
- రక్తహీనతకు చెక్ పెట్టేందుకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిశోర్, రాష్ట్రీయ బాలస్వస్థ్ ద్వారా జిల్లాలోని 10 ఆర్‌బీఎస్‌కే బృందాలు రోజూ 100మందిని డిజిటల్ మిషిన్‌తో పరీక్షిస్తున్నాయి.
- పిల్లల్లో 8శాతం కన్నా తక్కువ హిమోగ్లోబిన్‌తో ఇబ్బందిపడుతున్న వారికి ఐరన్, పోలిక్‌యాసిడ్ మాత్రలు ఉచితంగా అందిస్తున్నాయి.
- 8 నుంచి 10.9గ్రాముల హిమోగ్లోబిన్ ఉన్న వారికి అవసరమైన ఔషధాలు అందిస్తున్నారు.
- 11గ్రాములు కన్నా ఎక్కువ ఉంటే వైద్యం అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.
- 7 గ్రాముల కంటే తక్కువగా ఉంటే తీవ్రంగా ఉన్నట్లుగా నిర్ధారిస్తున్నారు.
- వీరిని ఆస్పత్రికి తరలించి రక్తం ఎక్కిస్తున్నారు.
- వివిధ వైద్య పరీక్షలు చేసి రక్తహీనతకు గల కారణాలు విశ్లేషిస్తున్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్నాం



కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమాన్ని జిల్లాలో పక్కాగా అమలు చేస్తున్నాం. ఈనెలాఖరు వరకు పిల్లలకు వైద్యపరీక్షలు కొనసాగిస్తాం. కేటగిరీ వారీగా లోపాలు గుర్తించి చికిత్స అందిస్తున్నాం. సమస్య తీవ్రత అధికంగా ఉంటే ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నాం. పౌష్టికహార లోపం, సమతుల ఆహారం అందక పోవడం రక్తహీనతకు కారణాలు.

– కృపాబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పాఠం చెబుతున్న ముజమ్మిల్‌ఖాన్

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. హెచ్ఎం సుధాకర్‌రావు అధ్యక్షత వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలను రెగ్యులర్‌గా బడికి పంపించే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థులు మంచిస్థాయికి ఎదిగేందుకు పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

15వరకు వృద్ధాశ్రమం పూర్తిచేయండి

సుల్తానాబాద్(పెద్దపల్లి): స్థానిక మార్కండేయకాలనీలో చేపట్టిన వృద్ధాశ్రమం నిర్మాణాన్ని మార్చి 15వ తేదీ నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. రూ.70 లక్షల వ్యయంతో చేపట్టిన వృద్ధాశ్రమ నిర్మాణ పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. ఒకే ప్రాంగణంలో వృద్ధాశ్రమం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సంక్షేమ భవనాలు నిర్మించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రవుఫ్‌ఖాన్, డీఈ దేవేందర్, సీడీపీవో కవిత పాల్గొన్నారు.

జాతరలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

- పెద్దపల్లి ఏసీపీ కృష్ణ



మాట్లాడుతున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సమ్మక్క - సారలమ్మ జాతరలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఏసీపీ కృష్ణ సూచించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి మండలాల్లో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ సభ్యులతో శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన సమావేశమయ్యారు. భక్తులకు జాతర కమిటీలు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధానంగా వైద్య సిబ్బంది, ట్రాఫిక్ నిబంధనలు, వలంటీర్లను నియమించుకోవాలని సూచించారు. సీఐ జగదీశ్, ఎస్సైలు వినీత, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా ఉండాలి

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): అభాగ్యులకు పోలీసులు అండగా ఉండాలని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ యాదవ్ అన్నారు. పెద్దపల్లి ఏసీపీగా బాధ్యతలు స్వీకరించి.. తొలిసారి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఓంకార్‌కు పలు సూచనలు చేశారు. ఇదే ఠాణాలో తాను ఎస్సైగా పనిచేశానని కృష్ణ గుర్తుచేసుకున్నారు. అనంతరం పలువురు ఆయనను సన్మానించారు. ఎస్సై ఓంకార్, పందిల్ల ఎంపీటీసీ రావి సదానందం, మాజీ ప్రజాప్రతినిధులు ఎం.సదానందం, పి.సదానందం, గాజనవేన సదయ్య, మాదాసు సతీశ్, రాజగొల్ల, సబ్బని రాయమల్లు, అనిల్, ఏఎస్సై నీలిమ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలో జాగ్రత్త

వనదేవతల జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కమిటీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏసీపీ కృష్ణ యాదవ్ సూచించారు. మీర్జంపేట మానేరు తీరంలోని సమ్మక్క జాతరను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎస్సై ఓంకార్ యాదవ్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు. కాగా, పెగడపల్లిలోని జాతరను తహసీల్దార్ జాహెద్ పాషా పరిశీలించారు. ఎంపీపీ సంపత్, ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపీవో గోవర్ధన్, పీఆర్ ఏఈ జగదీశ్, ఎంపీటీసీలు జనార్దన్‌రెడ్డి, నిర్మల, మాజీ సర్పంచులు నాగార్జున్‌రావు, సుజాత పాల్గొన్నారు.

11 దాటినా హాజరుకాని అధికారులు!

- సమయపాలన పాటించని అటెండర్లు
- నీటిపారుదల శాఖ కార్యాలయంలో దుస్థితి



ఈఈ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

మంథని: పట్టణంలోని నీటిపారుదల శాఖ ఈఈ కార్యాలయం(డివిజన్-4)లో అధికారులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. శనివారం ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయంలో ఒక్క అధికారి కూడా విధులకు హాజరు కాలేదు. సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లిన మీడియా ప్రతినిధులకు కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

విధుల్లో ఇద్దరే..

కార్యాలయంలో 12 మంది అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి. కానీ, అటెండర్ కొండయ్య, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. ఈఈ బలరామయ్య, సూపరింటెండెంట్ శారద, ఏఈ వందన, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు అడెండర్లు విధులకు హాజరు కాలేదు. జిల్లాలో మానేరు వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు మంథని ఈఈ కార్యాలయం పరిధిలోనే ఉన్నాయి. వివిధ పనుల కోసం వచ్చే వారికి కార్యాలయంలో సమాధానం చెప్పేవారు లేక వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

మెమోలు జారీ

సమయానికి కార్యాలయానికి రాని అధికారులు, అటెండర్లకు మెమోలు జారీ చేసినట్లు ఈఈ బలరామయ్య తెలిపారు. తనకు కళ్లలో ఇన్ఫెక్షన్ కావడంతో విధులకు హాజరు కాలేదని తెలిపారు. మరోసారి ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కాళేశ్వరంతో ఒరిగిందేమీలేదు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు
- అసెంబ్లీలో మాట్లాడిన శాసనసభ్యుడు



విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: 'కాళేశ్వరం.. గత ప్రభుత్వ పాలకులు కమీషన్ల కోసం కట్టిన ప్రాజెక్టు.. ఆ ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలకులకు ఏటీఎంగా మారింది.. అంతే తప్ప రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి నిర్మిస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఒక్క ఎకరాకి కూడా నీరందలేదు' అని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. అసెంబ్లీలో శనివారం సాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసిన సందర్భంగా జరిగిన చర్చలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు.. బీఆర్ఎస్ పాలకుల అవినీతిని ఎత్తిచూపారు. రైతాంగానికి మేలు చేయాలన్న శ్రద్ధ గత పాలకులకు లేదని విమర్శించారు. ప్రజాధనాన్ని దోచుకుని దాచుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. చివరి ఆయకట్టుకు సాగునీరందించలేని అసమర్థ బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడారని ఆయన పేర్కొన్నారు.

శ్మశానంలో ఎముకల దొంగలు!

- జిల్లాలో ముఠా సంచారం
- దహనం చేసిన శవాల ఎముకల చోరీ
- రెండు రోజుల్లో నలుగురి పట్టివేత



స్థానికులు పట్టుకున్న యువకులు వీరే..

సుల్తానాబాద్(పెద్దపల్లి): శ్మశానంలో దొంగలు పడ్డారు.. శవాన్ని దహనం చేయగా మిగిలిన పుర్రెలు, ఎముకల్ని చోరీ చేస్తున్నారు.. వీటిని ఏం చేస్తారో తెలియదు కానీ.. కొందరు యువకుల ముఠా ఈ దురాగతానికి పాల్పడుతోంది.. మంత్రతంత్రాలు, పూజలు, చేతబడులు చేయడం లాంటి మూఢనమ్మకాల్ని ఇప్పటిదాకా చూశాం.. విన్నాం.. కానీ, ఇలాంటి విచిత్రమైన ఘటన జిల్లాలో చోటుచేసుకోవడం విస్మయం కలిగిస్తోంది.

రెండు రోజుల్లో నలుగురి పట్టివేత..

సుల్తానాబాద్‌లోని హిందూ శ్మశానవాటికలో రెండురోజుల వ్యవధిలో నలుగురు వ్యక్తులు ఎముకలు చోరీచేస్తూ స్థానికులకు పట్టుబడ్డారు. శవాలను కాల్చివేయగా మిగిలిన ఎముకలను పోగుచేసుకుని, ఒక సంచీలో వేసుకుని తీసుకెళ్తున్నారు. శుక్రవారం ఇద్దరు యువకులు ఇలా ఎముకలు తీసుకెళ్తుండగా స్థానికులు పట్టుకున్నారు. ఎముకల్ని అక్కడే వదిలివేయగా, ఆ యువకులను బెదిరించి అక్కడి నుంచి పంపించివేశారు. శనివారం ఇద్దరు మహిళలు కూడా శ్మశానంలో ఎముకలు పోగుచేస్తూ అక్కడి మున్సిపల్ సిబ్బందికి పట్టుపడ్డారు. అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ మహిళలను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నా..

కొన్నిరోజులుగా వైకుంఠధామాల్లోని ఎముకలు మాయమవుతున్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతదేహాల ఎముకలను కుటుంబ సభ్యులు సేకరించి 5, 9, 11వ రోజుల తర్వాత గోదావరి నదిలో కలుపడం సంప్రదాయం. అయితే, కొన్నిరోజులుగా శ్మశానంలో అస్థికలు కనిపించకపోవడంతో చాలామంది అవి కాలిపోయినట్లు ఇంతకాలం భావిస్తూ వచ్చారు. ఎముకల దొంగలు పట్టుపడడంతో తమవారి ఎముకలను కూడా వారే ఎత్తుకెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారంతో ముఠాను మున్సిపల్ సిబ్బంది రాజకుమార్, వినోద్ పట్టుకున్నారు. మాజీ సర్పంచ్ అంతటి అన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ సిబ్బందికి సహకరించారు.

విచారణ జరుపుతున్న పోలీసులు..

రెండురోజుల వ్యవధిలో నలుగురు ఎముకల దొంగలు పట్టుపడడంతో సుల్తానాబాద్ మున్సిపల్ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ వేగవంతం చేశారు. కాగా, పదేళ్లక్రితం మృతదేహాలను కాల్చిన కట్టెల బొగ్గులు తీసుకుని వచ్చి కంకులు కాల్చేవారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇలా చేసేవారు.

పోదాం పద..
సమ్మక్క జాతర

- ఈ నెల 21 నుంచి వనదేవతల జాతర
- ముస్తాబవుతున్న అమ్మవార్ల గద్దెలు
- భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- ఉమ్మడి జిల్లాలో ఎత్తు బెల్లం మొక్కులతో మొదలైన సందడి

గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తోంది.. ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనుంది. ఇప్పటికే పల్లె, పట్టణం అనే తేడా లేకుండా భక్తులు ఎత్తు బెల్లం మొక్కు చెల్లించేందుకు సమ్మక్క మేడారం వెళ్తుండటంతో ఉమ్మడి జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. జాతర నిర్వహించే ప్రాంతాల్లో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బస్సులు, విద్యుత్, తాగునీరు, స్నానఘట్టాలు, దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, టాయిలెట్లు, పార్కింగ్, విడిది, చలువ పందిళ్లు తదితర ఏర్పాట్లపై జాతర కమిటీల నిర్వాహకులు అధికారులు సమన్వయంతో ముందుకుసాగుతున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు విధులకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో జాతర జరిగే తీరు, చేస్తున్న ఏర్పాట్లపై ప్రత్యేక కథనం.

హన్మంతునిపేటలో 42 ఏళ్లుగా..


హన్మంతునిపేట సమ్మక్క–సారలమ్మ ఆలయం

పెద్దపల్లిరూరల్: గిరిజన తల్లులు సమ్మక్క–సారలమ్మ జాతరకు అమ్మవార్ల ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, తుర్కలమద్దికుంట, పెద్దకల్వల గ్రామాల్లో ఏటా జరుపుతున్నారు. హన్మంతునిపేట శివారులో 42 ఏళ్లుగా, తుర్కలమద్దికుంట పెద్దగుట్ట వద్ద 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న జాతరకు భక్తులు పోటెత్తుతారు. హన్మంతునిపేటకు చెందిన కంకటి గోపాల్ కిషన్‌రావు, ఆయన సోదరులు ప్రభాకర్‌రావు, శంకర్‌రావు, సుగుణాకర్‌రావు, రాంచందర్‌రావు, ప్రసాదరావులు తమ తండ్రి మధుసూదన్‌రావు, తల్లి అంబాబాయి జ్ఞాపకార్థం 10 గుంటల భూమిని విరాళంగా ఇచ్చారు. ఈ స్థలంలో గ్రామ పెద్దలు సమ్మక్క–సారలమ్మ ఆలయం నిర్మించారు. ఈసారి జాతరకు అన్ని వసతులు కల్పిస్తున్నారు.

ఏర్పాట్లు చేశాం..



సమ్మక్క జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు బిగించాం. అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– పొల్సాని సుధాకర్‌రావు, హన్మంతునిపేట ఆలయ కమిటీ చైర్మన్

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదుచోట్ల


శాంతినగర్ సమ్మక్క–సారలమ్మ గుడి

సిరిసిల్ల: సమ్మక్క జాతర నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని ఒబులాపూర్ మూడు రోజులపాటు జనసంద్రమవుతుంది. సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబయి, భీవండి, షోలాపూర్, హైదరాబాద్ వంటి పట్టణాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. 40 ఏళ్లుగా ఇక్కడ జాతర జరుగుతోంది. సిరిసిల్ల నుంచి మండెపల్లి, రాళ్లపేట మీదుగా 13 కిలోమీటర్లు ప్రయాణిస్తే సమ్మక్క–సారలమ్మ గద్దెలు దర్శనమిస్తాయి. ఆటోల సౌకర్యం ఉంది. వీర్నపల్లి మండలంలోని వన్‌పల్లి శివారు శాంతినగర్ భానోత్ గిరిజన తండాలో 52 ఏళ్లుగా సమ్మక్క–సారలమ్మ జాతర సాగుతోంది. సమీప గ్రామాల నుంచే కాకుండా పొరుగున ఉన్న నిజామాబాద్ జిల్లా నుంచి గిరిజనులు ఎక్కువగా వచ్చి, అమ్మవార్లను దర్శించుకుంటారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో ఎనిమిదేళ్లుగా జాతర జరుగుతోంది. కోనరావుపేట మండలంలోని శివంగళపల్లె, ముస్తాబాద్ మండల కేంద్రంలో గిరిజన తల్లుల గద్దెలు సిద్ధమయ్యాయి.


మీర్జంపేట జాతర స్వాగతతోరణం

మీర్జంపేట మానేరు తీరాన..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని మీర్జంపేటలో మానేరు నదీతీరాన సమ్మక్క జాతర 52 ఏళ్లుగా సాగుతోంది. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఎత్తు బెల్లం, తలనీలాలు సమర్పించి, మొక్కు చెల్లించుకుంటారు. పెద్దరాతుపల్లి మానేరు తీరంలో, పెగడపల్లి హుస్సేన్‌మియా వాగు తీరంలోనూ జాతర జరుగుతుంది.

భక్తులకు సౌకర్యాలు కల్పించాం



మీర్జంపేట జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు సకల సౌకర్యాలు కలిపించాం. మానేరు వెంట మోటార్లు 24 గంటలు నడిపించేందుకు రైతులు సహకరిస్తారు. ట్రాన్స్‌కో అధికారులు జాతర సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటారు. గ్రామ యువకులు, మహిళలు వలంటీర్లుగా సేవలందిస్తారు.

– అశోక్, జాతర కమిటీ చైర్మన్, మీర్జంపేట

'ఖని'లో మినీ మేడారం


గోదావరి తీరంలో జాతర ప్రాంగణం

గోదావరిఖని(రామగుండం): మినీ మేడారంగా విలసిల్లుతున్న గోదావరిఖని గోదావరి నదీతీరం అడవి తల్లుల జాతరకు ముస్తాబవుతోంది. సింగరేణి యాజమాన్యం 1992లో గోదావరి తీరంలోని సంస్థ స్థలంలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభించింది. ఏటా సమ్మక్క మేడారం ప్రాంతానికి చెందిన కోయ పూజారులను తీసుకువచ్చి, ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి 5 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. జాతర సమయంలోనే కాకుండా గోదావరి తీరాన్ని పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక దృష్టిసారించారు. ప్రధానంగా సింగరేణి యాజమాన్యం ద్వారా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి నదిలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించామని తెలిపారు.

పకడ్బందీ ఏర్పాట్లు



భక్తులకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నాయి. మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. నదీ తీరంలో స్నానాలు చేసేందుకు షవర్స్ ఏర్పాటు చేశాం. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి తాత్కాలిక గదులు సిద్ధం చేస్తున్నాం. వంద టాయిలెట్స్ నిర్మిస్తున్నాం.

– పిన్నింటి శ్రీనివాస్‌రెడ్డి

తెలుకుంట, అబ్బాపూర్‌లో..


తెలుకుంటలో భక్తుల మొక్కులు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్, తెలుకుంట గ్రామాల్లో ఏటా సమ్మక్క జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. మేడారం కోయ పూజారులతో జరిపించే ఈ జాతరకు ఉమ్మడి కరీంనగర్‌లో జిల్లాలోని భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు. అబ్బాపూర్‌లో 2002లో పోచమ్మ గుట్టపై, తెలుకుంటలో 1994లో రామప్ప గుట్టపై వెలసిన సమ్మక్క–సారలమ్మ తల్లులను కోయ పూజారులు తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభమైంది. జాతర కమిటీలు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రవాణా, విద్యుత్, తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాయి. స్నానాలకు తెలుకుంటలో రామప్ప చెరువు ఉండగా, అబ్బాపూర్‌కు డీ–83 కెనాల్ నీటితోపాటు హుస్సేన్‌మియా వాగు అందుబాటులో ఉన్నాయి.

శంకరపట్నంలో 1978 నుంచి..


శంకరపట్నంలో సమ్మక్క గద్దె

శంకరపట్నం(మానకొండూర్): మండల కేంద్రంలో సమ్మక్క–సారలమ్మ జాతర ప్రారంభమై 46 ఏళ్లవుతోంది. కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రం వీరయ్య, మరో 13 మంది కలిసి 1978 ఫిబ్రవరి 22న వెంకయ్య గుట్ట నుంచి అమ్మవార్లను తీసుకువచ్చి, గద్దెలపై ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు తిమ్మాపూర్, బెజ్జంకి, చిగురుమామిడి, మానకొండూర్ మండలాలు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల నుంచి భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి 10 నిమిషాలకో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. జాతర కమిటీవారు ఏర్పాట్లు చేశారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో జాతర నిర్వహించనున్నారు.

గోలివాడ ఇసుకలో కుంకుమ భరిణె



గోలివాడలో సమ్మక్క–సారలమ్మ గద్దెలు

రామగుండం: అంతర్గాం మండలంలోని గోలివాడ గోదావరి నది ఒడ్డున సమ్మక్క–సారలమ్మ జాతరకు 42 ఏళ్లు. 1982లో గ్రామానికి చెందిన జాలిగామ కిషన్‌రావు అలియాస్ బయ్యాజీ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. అక్కడ ఇసుకలో కుంకుమ భరిణె కనిపించడంతో ఇంటికి తీసుకువచ్చారు. అదేరోజు రాత్రి నిద్రలో వనదేవతలు కలలోకి వచ్చి, నీకు కుంకుమ భరిణె దొరికిన స్థానంలో సమ్మక్క–సారలమ్మ, పగిడిద్దెరాజుల గద్దెలు నిర్మించి, జాతర నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామ ప్రముఖులు ఆవుల చంద్రయ్య, పెంద్రు హన్మాన్‌రెడ్డిలకు చెప్పారు. అందరూ కలిసి గోదావరి నది ఒడ్డుకు వెళ్లి, పరిశీలించగా కుంకుమ భరిణె, పూజా సామగ్రి కనిపించాయి. దీంతో అదే ఏడాది వనదేవతల గద్దెలు నిర్మించి, జాతర ప్రారంభించారు. గ్రామానికి చెందిన 41 మందితో వ్యవస్థాపక కమిటీ ఏర్పాటు చేసుకొని, జాతర కొనసాగిస్తున్నారు.

గన్నేరువరం, మైలారం గ్రామాల్లో..


మైలారంలో ముస్తాబైన అమ్మవార్ల గద్దెలు

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, మైలారం గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతరకు జాతర కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. గన్నేరువరంలో చిలుకలగుట్ట సమీపంలో ప్రధాన రహదారి పక్కన, మైలారంలో శ్రీ మల్లికార్జునస్వామి పెద్దగుట్ట పక్కన లోయర్ మానేరు డ్యాంకు 100 మీటర్ల దూరంలో జాతర జరగనుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి దాదాపు 10 వేల మందికి పైగా భక్తులు వస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొలనూర్‌లో కోయ పూజారులతో..


ముస్తాబైన సమ్మక్కసారలమ్మ గద్దెలు

ఓదెల(పెద్దపల్లి): మండలంలోని కొలనూర్‌లో 1974 నుంచి జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరకు ఈసారి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మేడారం కోయ పూజారులచే పూజలు నిర్వహించనున్నారు. ఇక్కడ అల్లీమాసాని చెరువు(జంపన్నవాగు) ఉంది. సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం, సిర్పూర్‌కాగజ్‌నగర్, నాగపూర్ నుంచి కొలనూర్ జాతర వరకు రైళ్ల సౌకర్యం ఉంది. దీనికితోడు భక్తులకు గోదావరిఖని, కరీంనగర్, వరంగల్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు అందుబాటులో ఉన్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి 2 లక్షల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం..



కొలనూర్ జాతరకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు నీడ, విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం. స్నానాల కోసం సమీపంలోని జంపన్నవాగు వద్ద స్నానవాటికలు ఏర్పాటు చేశాం. అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లు సిద్ధమయ్యాయి.

– దేవిడి శ్యాంరెడ్డి, జాతర కమిటీ చైర్మన్

చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద


చిల్వాకోడూర్‌లో ముస్తాబైన గద్దెలు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని చిల్వాకోడూర్, వెల్గటూర్ మండల కేంద్రంతోపాటు, రాజారాంపల్లి, ధర్మపురి మండలంలోని రామయ్యపల్లి గ్రామాల్లో సమ్మక్క–సారలమ్మ జాతర జరుగుతుంది. నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిల్వాకోడూర్ ఎక్కల్‌దేవి గుట్ట కింద నిర్వహించే జాతరకు జగిత్యాల జిల్లాలోనే అత్యధిక మంది భక్తులు తరలివస్తారు. అమ్మవార్లకు బుక్క, పూసవేర్ల, మేడారం పూజారులు పూజలు చేస్తారు. 1994లో గ్రామానికి చెందిన గందె రామయ్య, కరెంట్ రాజయ్య కలలో దేవతలు కనిపించడంతో కంకవనం తీసుకువచ్చి, ఎక్కల్‌దేవి గుట్ట సమీపంలో పాతి, పూజలు చేశారు. ఆ తర్వాత జాతర ప్రారంభమైంది. 2001 నుంచి మేడారం పూజారులచే పూజలు చేయిస్తున్నారు. రాజారాంపెల్లిలో ఏలేటి వంశీయులు 2011లో ఏర్పాటు చేసిన గద్దెల వద్ద ఏటా జాత జరుగుతోంది. ఈసారి కూడా ఏర్పాట్లు చేసినట్లు జాతర కమిటీ చైర్మన్ శైలేందర్ రెడ్డి తెలిపారు.

ఏటా జాతరకు వస్తా..

మాది సమక్క–సారలమ్మ వెలసిన మేడారం గ్రామం. చిల్వాకోడూర్‌లో మా బావ కోరం హన్మంతు ఏటా జాతరకు వచ్చి, పూజలు చేసేవాడు. ఆయన నాలుగేళ్ల క్రితం చనిపోవడంతో నేను వస్తున్నాను. ఏటా లక్షన్నరకు పైనే భక్తులు వస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, జాతరకు సహకరించాలి.

– కోరం లక్ష్మణ్, పూజారి, సమ్మక్క మేడారం

నీరుకుల్ల–వేగురుపల్లి మధ్య..


2022లో జాతర ప్రదేశంలో భక్తుల విడిది (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్: మండలంలోని నీరుకుల్ల–వేగురుపల్లి గ్రామాల మధ్య రంగనాయకస్వామి ఆలయ సమీపంలో 45 ఏళ్లుగా సమ్మక్క–సారలమ్మ జాతర అత్యంత వైభవంగా జరుగుతోంది. పెద్దపల్లి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం కోయ పూజారులు వచ్చి, ఇక్కడ పూజలు చేస్తారు. జారత ప్రదేశంలో మానేరు నది ఉంది. దేవాదాయశాఖ, జాతర కమిటీవారు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్, గోదావరిఖని నుంచి సుల్తానాబాద్ మీదుగా, కరీంనగర్ నుంచి వేగురుపల్లి మీదుగా జాతరకు బస్సులు, ఆటోలున్నాయి. కరీంనగర్, పెద్దపల్లి నుంచి రైల్వే సౌకర్యం కూడా ఉంది.

అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు



జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో రోడ్లు, విద్యుత్, ట్రాఫిక్, వైద్యం, శానిటేషన్, అత్యవసర సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– నర్సయ్యగౌడ్, జాతర కమిటీ చైర్మన్

1990 నుంచి రేకుర్తిలో..


రేకుర్తిలో అమ్మవార్ల గద్దెలు

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో సమ్మక్క–సారలమ్మ జాతరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ కార్పొరేషన్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. 1990లో పిట్టల రాజమల్లయ్య కలలో సమ్మక్క–సారలమ్మ కనిపించి, గద్దెలు ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఆయన అదే ఏడాది ఫిబ్రవరి 6న అమ్మవార్లకు గద్దెలు నిర్మించారు. అప్పటినుంచి రెండేళ్లకోసారి జాతర జరుగుతోంది. ఇక్కడికి కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి జగిత్యాల ప్రధాన రహదారిలో 4 కిలోమీటర్ల దూరంలో అమ్మవార్ల గద్దెలున్నాయి. బస్టాండ్ నుంచి ఆటోలు, బస్సులు నడుస్తాయి. జాతరకు కార్పొరేషన్ నిధుల నుంచి రూ.66 లక్షలు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. వివిధ వస్తువుల అమ్మకాల టెండర్ ద్వారా రూ.9 లక్షలు సమకూరినట్లు దేవాదాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. కోయ పూజారులచే పూజలు జరిపించనున్నారు.

బాధ్యతగా పనిచేయండి

కోల్‌సిటీ(రామగుండం): సమయపాలన పాటించడంతోపాటు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల వారీగా అధికారులు, సిబ్బందితో వివిధ అంశాలపై సమీక్షించారు. ఆస్తిపన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు, వాణిజ్య ప్రకటనల బిల్లులు తక్కువగా వసూలు చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా నిర్దేశిత లక్ష్యం సాధించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్ రావు, ఎస్‌ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్ పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పించండి

గోదావరిఖని: తనకు పోలీస్‌శాఖలో మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ మాజీ హోంగార్డు ఎం.పద్మ శనివారం ప్లకార్డుతో నిరసన తెలిపారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో బైఠాయించి తనకు న్యాయం చేయాలని కోరారు. తనను అన్యాయంగా ఉద్యోగం నుంచి తొలగించారని ఆవేదన చెందారు. 2014 డిసెంబర్ 24న తనను ఉద్యోగం నుంచి తొలగించారని, అప్పటి నుంచి కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలని కోరారు.

కొత్త బొగ్గు గనులతోనే సింగరేణికి భవిష్యత్

గోదావరిఖని: కొత్త బొగ్గు గనుల తవ్వకంతోనే సింగరేణికి భవిష్యత్ ఉందని బీఎంఎస్ ఆలిండియా డెప్యూటీ ప్రధాన కార్యదర్శి, కేంద్ర కాంట్రాక్టు వర్కర్స్ బోర్డు చైర్మన్ సురేంద్రకుమార్ పాండే అన్నారు. బీఎంఎస్ 4వ త్రైవార్షిక మహాసభలను పురస్కరించుకుని శనివారం రాత్రి స్థానిక ప్రధాన చౌరస్తాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో రాజకీయ జోక్యం తగదన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలనే కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అప్పటివరకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవిషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. ఐడీ యాక్టు ప్రకారం బొగ్గు గనుల్లో ప్రభుత్వ జోక్యం తగదని అన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించిన కాంగ్రెస్.. ప్రస్తుతం అదే పనిచేస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు దొరై రాజు, రవీంద్రరాజు, రాంరెడ్డి, మల్లేశం, యాదగిరి సత్తయ్య, బూర్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఉదయం సరస్వతి శుమందిర్‌లో బీఎంఎస్ నాయకులకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి అతిథిగా హాజరై పలు అంశాలపై మాట్లాడారు.

కార్మికులకు పదోన్నతి

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలోని వకీల్‌పల్లిగనిలో పనిచేస్తున్న వంద మంది ఉద్యోగులకు సర్ఫేస్ మజ్దూర్లుగా శనివారం పత్రాలు అందజేశారు. సీనియార్టీ ప్రాతిపదికన పదోన్నతి కల్పించినట్లు అధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు తెలిపారు. ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గని మేనేజర్ రవికిరణ్, సంక్షేమాధికారి ఓంకారిబాబు, ఏఐటీయూసీ నాయకులు ఎల్.ప్రకాశ్, కె.రాజరత్నం, జిగురు రవీందర్ పాల్గొన్నారు.

సింగరేణి బిడ్డకు 5 ప్రభుత్వ ఉద్యోగాలు

గోదావరిఖని: ఎంత కష్టపడినా ప్రభుత్వ ఉద్యోగం రాక చాలామంది ప్రైవేట్ కొలువులతో జీవితాన్ని సాగదీస్తున్నారు. కానీ, సప్తగిరికాలనీలో నివాసం ఉంటూ సింగరేణి ఓసీపీ–1లో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న గాదె సమ్మయ్య కుమారుడు లెనిన్ ఏకంగా 5 ప్రభుత్వ కొలువులు సాధించాడు. 2022లో సింగరేణి జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి, ఎంపికయ్యాడు. డిసెంబర్‌లో ఉద్యోగంలో చేరాడు. 2023 అక్టోబర్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్ష రాసి, 8వ ర్యాంక్ సాధించాడు. అదే ఏడాది సెప్టెంబర్‌లో హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ పరీక్ష రాసి, ఎంపికయ్యాడు. జూలైలో పాలిటెక్నిక్ లెక్చరర్ పరీక్ష రాసి, ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం సింగరేణి బెల్లంపల్లి ఏరియాలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. తాజాగా వెలువడిన ఏఎంవీఐ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 12వ ర్యాంకుతో సత్తా చాటాడు. భవిష్యత్‌లో ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపాడు. మూడేళ్ల పాటు కష్టపడి చదడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని పేర్కొన్నాడు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూనే రోజుకు 8 నుంచి 12 గంటలు చదివానన్నాడు. సమీప బంధువు గ్రూప్–2 ద్వారా ఎక్సైజ్ సీఐగా ఎంపికైన రమేశ్ అన్న స్ఫూర్తితో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాయని తెలిపాడు.

తండ్రిని చంపిన కుమారుడి అరెస్టు

పెద్దపల్లిరూరల్: మద్యానికి బానిసైన హన్మంతునిపేటకు చెందిన యాదగిరి ఓదెలు(55)ను అతని కుమారుడు రాజశేఖర్ కత్తితో పొడిచి చంపాడని ఏసీపీ కృష్ణ తెలిపారు. పెద్దపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కృష్ణ, ఎస్సైలు సంజీవరావు, మల్లేశ్‌లతో కలిసి వివరాలు వెల్లడించారు. ఓదెలు పెళ్లి సంబంధాలు చూస్తానంటూ రోజుల తరబడి తిరుగుతుంటాడు. ఇంటికి ఎప్పుడో ఓసారి వస్తే మద్యం మత్తులోనే ఉండేవాడు. ఇంటి బాగోగులు ఎందుకు పట్టించుకోవంటూ అతని కుమారుడు రాజశేఖర్ నిలదీస్తే ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. దీంతో ఓదెలు కోపోద్రిక్తుడై, తన కొడుకును దూషించి, కొట్టేవాడు. దీంతో విసిగిపోయిన రాజశేఖర్ తన తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికొచ్చిన ఓదెలు గతంలో మాదిరిగానే కుమారుడితో గొడవకు దిగాడు. దీంతో అతను సహనం కోల్పోయి, కోపంతో వంట గదిలోకి వెళ్లి, కూరగాయలు కోసే కత్తి తీసుకువచ్చాడు. ఓదెలు ఛాతీ, పొట్టపై పొడిచి హతమార్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.